క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
6-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:15
సంచిక: 354

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# పరుగుల వరదతో ఫైనల్లోకి

టి20 ప్రపంచకప్‌లో
తుది పోరుకు భారత్

సెమీస్‌లో 7 పరుగులతో ఇంగ్లండ్‌పై గెలుపు

మళ్లీ చెలరేగిన సంజు సామ్సన్

బెతెల్ శతకం వృథా

ఆదివారం న్యూజిలాండ్‌తో ఫైనల్

భారత జట్టు స్కోరు 253 పరుగులు... ఇందులో 18 ఫోర్లు, 19 సిక్స్‌లు.. వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టూ కూడా ఇంత లక్ష్యాన్ని ఛేదించలేదు. ఇక గెలుపు లాంఛనమే, ఫైనల్ చేరడం ఖాయమనే అనిపించింది. కానీ ఇంగ్లండ్ కూడా ఏమాత్రం తగ్గలేదు. భారీ స్కోరును చూసి బెదిరిపోకుండా ఆ జట్టు కూడా 21 ఫోర్లు, 15 సిక్స్‌లతో ఆఖరి వరకూ పోరాడింది... కానీ అదృష్టవశాత్తూ టీమిండియా అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో చివరకు 7 పరుగులతో సూర్యకుమార్ బృందం గట్టెక్కింది. గత మ్యాచ్ తరహాలోనే సంజు సామ్సన్ మరో అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును నడిపించగా... ఇంగ్లండ్ తరపున జాకబ్ బెతెల్ శతకం జట్టును గెలిపించేందుకు సరిపోలేదు. చివర్లో కట్టుదిట్టమైన మన బౌలింగ్ భారత్‌ను ఫైనల్‌కు చేర్చింది. టి20 వరల్డ్ కప్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టుగా నిలిచేందుకు ఇక ఒకే ఒక్క విజయం భారత్‌కు కావాలి. ఆదివారం ఆఖరి సమరంలో న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోవడమే టీమిండియాకు మిగిలింది.

2లో

# బీర్లు తెగ తాగేస్తున్నారు..!!




రాష్ట్రంలో భారీగా పెరిగిన బీర్ల విక్రయాలు

గత ఐదేళ్ల రికార్డులు తిరగరాసేలా అమ్మకాలు

- ఫిబ్రవరిలోనే 38 లక్షల కేసులు ఖాళీ
- ఈ నెల మొదటి 4రోజుల్లోనే 8లక్షల కేసులు ఖతమ్
- డిమాండ్ ను ముందుగానే పసిగట్టిన కంపెనీలు
- గతేడాది కన్నా భారీగా బీర్ల ఉత్పత్తి పెంపు
- 35 రోజులకు సరిపడా ముందస్తు స్టాక్ సిద్ధం

వేసవికాలం.. మండే ఎండలు.. కళ్లెదురుగా చల్లటి బీరు. ఇంకేముంది.. లాగించేయడమే.. సేద దీరడమే. ఔను.. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి అలాగే ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా బీర్లు తెగ తాగేస్తున్నారు. దీంతో బీర్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ఎండకాలం ప్రారంభం దశలోనే ఈ ఏడాది బీర్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. గత ఐదేళ్ల రికార్డులను 2024లో జరిగిన బీర్ల అమ్మకాలు తుడిచిపెట్టేశాయి.

2లో



## లిక్కర్ కేసు కొట్టేయడంతో స్వామికి మొక్కు

తిరుమలకు కాలినడకన చేరుకున్న కవిత

త్వరలోనే రాజకీయ పార్టీ ఏర్పాటు

తెలంగాణ ఫస్ట్ నినాదంతో ముందుకు వెళతామని ప్రకటన

# యుద్ధ బీభత్సం

అమెరికాకు చెందిన చమురు నౌకపై ఇరాన్ మెరుపు దాడి

ఇరాక్, కువైట్‌ల్లో కూడా రెండు చమురు నౌకలపై దాడి!

యూఏఈ, అజర్‌బైజాన్, దోహాపై బాంబులు, డ్రోన్లు


ఇరాన్ నౌకాశ్రయంపై భారీ దాడులతో విరుచుకుపడ్డ అమెరికా

నౌక పూర్తిగా మంటల్లో చిక్కిందని పేర్కొన్న ఇరాన్ ప్రభుత్వ వర్గాల

పశ్చిమాసియాలో కొనసాగుతున్న కల్లోలం

దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో క్షిపణి, బాంబు దాడులతో విధ్వంసం

లెబనాన్‌పై దాడుల తీవ్రతను మరింత పెంచిన ఇజ్రాయెల్



దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం నానాటికీ పెరుగుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ గురువారం ఆరో రోజు ఇరాన్ వ్యాప్తంగా భారీ స్థాయిలో క్షిపణులు, బాంబు దాడులతో విరుచుకుపడ్డాయి. ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై పలు దఫాలుగా తీవ్ర స్థాయిలో దాడులు కొనసాగించింది. పలు గల్ఫ్ దేశాలపైనా మరిన్ని డ్రోన్ దాడులకు పాల్పడింది. ఇరు పక్షాలూ నౌకలు, నౌకాశ్రయాలను లక్ష్యంగా చేసుకున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా చమురు నౌకపై దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. దానికి నిప్పంటుకుని భారీగా మంటలు ఎగసిపడుతున్నట్టు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) తెలిపింది. బుధవారం శ్రీలంక తీర సమీపంలో తమ యుద్ధనౌకపై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసినందుకు ప్రతీకారంగా ఈ చర్యకు దిగినట్టు వెల్లడించింది.

2లో

# అసోంలో డోనర్ ప్రాజెక్టుల పురోగతి భేష్

డబుల్ ఇంజన్ సర్కార్ తో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోయింది

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిశారు.

అభివృద్ధి, మౌలిక సదుపాయాల్లోనూ పురోగతి

నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రోత్సాహంవల్లే ఇదంతా సాధ్యమైందన్న అసోం అధికారులు.

గౌహతిలోని కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్.

నేడు అసోంలోని దిమాహోసావో జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించనున్న బండి సంజయ్.

# సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభకు లాంఛనమే

కాంగ్రెస్ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నామినేషన్లు దాఖలు

సంఖ్యాబలం లేక పోటీకి దిగని బీఆర్ఎస్


స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు అవకాశం

సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పత్రాల సమర్పణ

రెండోసారి రాజ్యసభకు వెళ్లనున్న సింఘ్వీ

రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేస్తానన్న వేం నరేందర్‌రెడ్డి

2లో



# డిజిటల్ జనగణనకు శ్రీకారం

దేశ చరిత్రలో తొలిసారి పూర్తిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కలు

యాప్‌లు, పోర్టల్స్, మస్కట్‌లను ఆవిష్కరించిన కేంద్ర హోం మంత్రి షా

ఇంటింటి సర్వేకు సుమారు 30 లక్షల మంది సిబ్బంది రంగంలోకి

16 భాషల్లో స్వీయ నమోదు సౌకర్యం కల్పించిన కేంద్రం

రెండు దశల్లో జనగణన నిర్వహణకు కార్యాచరణ

2027 మార్చి ఒకటిని ప్రామాణిక తేదీగా నిర్ణయం

2లో

## ఏపీలో నేటి నుంచి పదో తరగతి హాల్ టికెట్ల జారీ



నేడు ఉదయం 11 గంటలకు పదో తరగతి హాల్ టికెట్ల విడుదల

మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న పబ్లిక్ పరీక్షలు

వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు




# పరుగుల వరదతో ఫైనల్లోకి




ముంబై: టి20 వరల్డ్ కప్‌ను నిలబెట్టుకునే ప్రయత్నంలో భారత జట్టు ఒకే ఒక్క అడుగు దూరంలో నిలిచింది. వరుసగా రెండోసారి మన టీమ్ తుది పోరుకు అర్హత సాధించింది. గురువారం వాంఖెడే మైదానంలో హోరాహోరీగా సాగిన రెండో సెమీఫైనల్ సమరంలో 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి భారత్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టాస్ గెలిచిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది.'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సంజు సామ్సన్ (42 బంతుల్లో 89; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా... శివమ్ దూబే (25 బంతుల్లో 43; 1 ఫోర్, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 39; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక పరుగులు సాధించారు. అనంతరం ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులు చేసి ఓడిపోయింది. జాకబ్ బెతెల్ (48 బంతుల్లో 105; 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీతో పోరాడినా జట్టుకు ఓటమి తప్పలేదు. ఆదివారం అహ్మదాబాద్‌లో జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడుతుంది. భారత్, కివీస్ మధ్య టి20 వరల్డ్ కప్ ఫైనల్ జరగడం ఇదే తొలిసారి.

**పోటీ పడి సిక్సర్లు బాది...**

ఓపెనర్ అభిషేక్ శర్మ (9) మరోసారి విఫలమైనా... సామ్సన్, ఇషాన్ భాగస్వామ్యంతో భారత్ దూసుకుపోయింది. ఆర్చర్ తొలి ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన సామ్సన్ అతని రెండో ఓవర్లో కూడా 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. మరోవైపు ఇషాన్ కూడా మూడు ఫోర్లు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 67 పరుగులకు చేరింది. డాసన్ ఓవర్లో భారీ సిక్స్‌తో 26 బంతుల్లో సామ్సన్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా, స్యామ్ కరన్ ఓవర్లో ఇద్దరూ కలిసి 20 పరుగులు రాబట్టారు. రెండో వికెట్‌కు 45 బంతుల్లో 97 పరుగులు జోడించిన తర్వాత ఎట్టకేలకు ఇషాన్‌ను రషీద్ అవుట్ చేశాడు. అయితే స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొనే వ్యూహంతో బ్యాటింగ్‌లో ముందుగా దూబేను పంపిన భారత్ ఫలితం రాబట్టింది. రషీద్ ఓవర్లో 2 భారీ సిక్స్‌లతో అతను చెలరేగాడు. ఆ తర్వాత ఆర్చర్ ఓవర్లో మరో రెండు సిక్స్‌లు బాదిన సామ్సన్ మరింత దూకుడుగా ఆడే ప్రయత్నంలో వెనుదిరిగాడు. సూర్యకుమార్ (11) ఎక్కువసేపు నిలవలేకపోగా, ఒవర్టన్ ఓవర్లో హార్దిక్ పాండ్యా (12 బంతుల్లో 27; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మూడు ఫోర్లు కొట్టాడు. ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో తిలక్ వర్మ (7 బంతుల్లో 21; 3 సిక్స్‌లు) ఏకంగా మూడు భారీ సిక్సర్లతో రెచ్చిపోయాడు. 20వ ఓవర్లో పాండ్యా మరో 2 సిక్స్‌లు కొట్టడంతో స్కోరు 250 దాటింది. ఆఖరి 5 ఓవర్లలో భారత్ 76 పరుగులు సాధించడం విశేషం.

**టాపార్డర్ విఫలం...**

భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ ఆరంభంలోనే ఫిల్ సాల్ట్ (5) వికెట్ కోల్పోయింది. జోస్ బట్లర్ (17 బంతుల్లో 25; 4 ఫోర్లు, 1 సిక్స్), హ్యారీ బ్రూక్ (7), టామ్ బాంటన్ (17) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. అయితే బెతెల్ మాత్రం పోరాటపటిమ కనబర్చాడు. బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ కొట్టిన అతను వరుణ్ చక్రవర్తి ఓవర్లో వరుసగా 6, 6, 6 బాదడం విశేషం. పాండ్యా ఓవర్లోనూ అతను వరుసగా సిక్స్, ఫోర్ కొట్టాడు. మరోవైపు విల్ జాక్స్ (20 బంతుల్లో 35; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా బెతెల్‌కు సహకరించాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 39 బంతుల్లో 77 పరుగులు జోడించారు. జాక్స్ అవుటైన తర్వాత స్యామ్ కరన్ (18)తో కలిసి గెలిపించేందుకు బెతెల్ తీవ్రంగా ప్రయత్నించాడు. అయితే ఆఖరి 5 ఓవర్లలో 69 పరుగులు చేయాల్సిన దశలో రెండు ఓవర్లు వేసిన బుమ్రా 14 పరుగులు మాత్రమే ఇవ్వడంతో మ్యాచ్ భారత్ వైపు మళ్లింది. 45 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న బెతెల్... శివమ్ దూబే వేసిన చివరి ఓవర్ తొలి బంతికి రనౌట్ కావడంతో ఇంగ్లండ్ ఆశలు కోల్పోయింది. తర్వాతి ఐదు బంతుల్లో ఆర్చర్ (19 నాటౌట్) మూడు సిక్స్‌లు బాదినా లాభం లేకపోయింది.

**17 ఓవర్ల వరకు ఇంగ్లండ్‌దే పైచేయి...**

దాదాపు అసాధ్యమైన లక్ష్యమే అయినా ఇంగ్లండ్ పూర్తిగా తడబడలేదు. వికెట్లు పడుతున్నా పరుగుల వేగం మాత్రం తగ్గించలేదు. ఇరు జట్ల ఇన్నింగ్స్‌లను పోలిస్తే 17 ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లండ్‌దే పైచేయిగా ఉంది. 10 ఓవర్లలో స్కోర్లు 119, 119తో సమంగా ఉండగా 15 ఓవర్లలో 177, 185తో ఇంగ్లండ్ ముందంజలో ఉంది.

17 ఓవర్లలో 205/4, 209/5తో వారిదే పైచేయి. అయితే చివరి 3 ఓవర్లు తేడా చూపించాయి. ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో తిలక్ కొట్టిన 3 సిక్స్‌లు కీలకంగా మారాయి. దూబే వేసిన ఆఖరి ఓవర్లో 30 పరుగులు కాపాడుకోవాల్సి వచ్చింది కాబట్టి భారత్ బతికిపోయింది. మరికొన్ని పరుగులు తక్కువగా ఉన్నా కష్టమయ్యేది.

**సామ్సన్ క్యాచ్ వదిలేసి...**

గత మ్యాచ్ తరహాలో ఈసారి కూడా సామ్సన్ దూకుడైన బ్యాటింగ్‌తో చెలరేగిపోయాడు. అయితే అతనికి ఈసారి అదృష్టం కూడా కలిసి వచ్చింది. సామ్సన్ 15 పరుగుల వద్ద ఉ న్నప్పుడు ఆర్చర్ బౌలింగ్‌లో మిడాన్ వద్ద కెప్టెన్ బ్రూక్ అతి సునాయాస క్యాచ్ వదిలేశాడు. దానికి ఇంగ్లండ్ ఫలితం అనుభవించింది.క్యాచ్ చేజారడమే కాదు, ఈ క్షణం బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఇంగ్లండ్ లయను బాగా దెబ్బ తీసింది. అప్పటి వరకు పరిస్థితి నియంత్రణలోనే ఉన్నా ఆ తర్వాత భారత్ పరుగుల వరద మొదలైంది. ఈ క్యాచ్‌ను బ్రూక్ పట్టి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేదేమో. లైఫ్ లభించిన తర్వాత సామ్సన్ 36 బంతుల్లో 74 పరుగులు బాదాడు.

**ఒక్క ఓవర్లోనే...**

భారత్ ఇన్నింగ్స్‌లో ఆటగాళ్లంతా ఏ బౌలర్‌ను వదలకుండా ప్రతీ ఓవర్లో బౌండరీలతో చెలరేగారు. అయితే జాక్స్ వేసిన ఒక్క 14వ ఓవర్ మాత్రమే దీనికి మినహాయింపు.

# సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభకు లాంఛనమే

హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. నామినేషన్లు ముగ్గురు వేసినా, ఇండిపెండెంట్‌గా వేసిన సాయి అనే వ్యక్తి నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. పదిమంది ఎమ్మెల్యేల సంతకాలు చేయాల్సి ఉన్నా, అతను కేవలం నామినేషన్ వేశారు. దీంతో స్క్రూటినీలో చెల్లుబాటు కాదు. ఈ కారణంగా ఇద్దరి ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ తరఫున తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు నామినేషన్ పత్రాలు సమర్పించారు. సింఘ్వీ.. మూడు సెట్‌ల నామినేషన్లు దాఖలు చేయగా.. వేం నరేందర్ రెడ్డి నాలుగు సెట్‌లు, ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి.. ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఈ నామినేషన్లను ఎన్నికల అధికారి పరిశీలించనున్నారు. ఎమ్మెల్యేల సంతకాలు లేని ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించనున్నారు. దాంతో అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ అభ్యర్థులు నిలవనున్నారు. వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బరిలో నిలపలేదు. గతంలో తెలంగాణ నుంచి రాజ్యసభకు వెళ్లిన అభిషేక్ మను సింఘ్వీ పదవి కాలం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. ఆయనకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మరోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించింది. ఇక తెలంగాణ నుంచి మరో రాజ్యసభ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లు, సూపర్ సీనియర్లు దాదాపు 16 మంది పోటీ పడ్డారు. ఆ జాబితాలోని ఎవరికి ఈ రాజ్యసభ స్థానం దక్కుతుందంటూ తీవ్ర ఉత్కంఠ సైతం నెలకొంది. అందుకోసం బుధవారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. పార్టీ అగ్రనేతలతో వరుస భేటీలు అయ్యారు. చివరకు తన సన్నిహితుడు వేం నరేందర్ రెడ్డి పేరు ఖరారు చేయించుకున్నారు.

## అసోంలో డోనర్ ప్రాజెక్టుల పురోగతి భేష్

హైదరాబాద్: అస్సోం రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రాయోజిత సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు వేగవంతంగా కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో గత ఐదేళ్లలో అస్సోంలో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిందని, దాదాపు 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి అందిస్తున్న సహాయ పునరావాస కారక్రమాలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, పెట్టుబడుల వివరాలపైనా కేంద్ర మంత్రి ఆరా తీశారు. గత ఐదేళ్లలో ఒక్క చిన్న ఫిర్యాదు కూడా లేకుండా ఏకంగా 1 లక్షా 51 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ వెల్లడించారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటి వరకు దాదాపు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగిందన్నారు. ఒక్క సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుతోనే 27 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు వచ్చాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏటా వృద్ధి రేటు పెరుగుతోందని, అదే సమయంలో క్రైం రేటు తగ్గుతోందని, కేంద్రం నూతనంగా అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాల అమలులతోనూ ముందంజలో ఉన్నట్లు వివరించారు.

## డిజిటల్ జనగణనకు శ్రీకారం

న్యూఢిల్లీ: దేశ చరిత్రలో తొలిసారిగా పూర్తిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద సర్వే ప్రక్రియగా గుర్తింపు పొందిన జనగణనను ఈసారి సాంకేతిక ఆధారిత విధానంలో చేపట్టాలని నిర్ణయించింది. సెన్సస్2027 కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన నాలుగు అత్యాధునిక డిజిటల్ యాప్‌లు, పోర్టల్స్‌తో పాటు 'ప్రగతి', 'వికాస్' అనే మస్కట్‌లను కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని అమలు చేసేందుకు దేశవ్యాప్తంగా సుమారు ముప్పై లక్షల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. గతంలో మాదిరిగా కాగితాలపై వివరాలు నమోదు చేయకుండా పూర్తిగా యాప్‌ల ఆధారంగా సమాచారాన్ని సేకరించనున్నారు. సీడాక్ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్‌ల ద్వారా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను నమోదు చేస్తారు. అవసరమైనప్పుడు ఆఫ్‌లైన్‌లో కూడా డేటా సేకరించే విధంగా ఈ యాప్‌లను రూపొందించారు. ఈసారి ప్రజలకు స్వీయ నమోదు సౌకర్యాన్ని కూడా కేంద్రం కల్పిస్తోంది. ఎన్యుమరేటర్ ఇంటికి రాకముందే ప్రజలు తమ స్మార్ట్ ఫోన్ల ద్వారా కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. దేశంలోని 16 ప్రాంతీయ భాషల్లో ఈ సేవ అందుబాటులో ఉంటుంది. ఇలా నమోదు చేసిన తర్వాత ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుంది. ఆ సంఖ్యను సిబ్బందికి చూపిస్తే సరిపోతుంది. జనగణన ప్రక్రియలో స్త్రీపురుషుల సమాన భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా 'ప్రగతి', 'వికాస్' అనే మస్కట్‌లను రూపొందించారు. మహిళా ఎన్యుమరేటర్‌కు 'ప్రగతి', పురుష ఎన్యుమరేటర్‌కు 'వికాస్' అని పేర్లు పెట్టారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని ఈ మస్కట్‌లు సూచిస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమం కోసం నాలుగు ప్రధాన డిజిటల్ సాధనాలను రూపొందించారు. హౌస్‌లిస్టింగ్ వెబ్ యాప్ ద్వారా శాటిలైట్ మ్యాప్‌ల ఆధారంగా డిజిటల్ బ్లాక్‌లను రూపొందిస్తారు.

## ఏపీలో నేటి నుంచి పదో తరగతి హాల్ టికెట్ల జారీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు కీలక అలర్ట్. రాష్ట్రంలో మార్చి 16 నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి నేడు (మార్చి 5) ఉదయం 11 గంటలకు హాల్ టికెట్లు విడుదల చేశారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కె.వి. శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు నేటి నుంచి తమ హాల్ టికెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సాంకేతికతను మరింత అందుబాటులోకి తెస్తూ.. ఈసారి 'మన మిత్ర' వాట్సాప్ నంబర్ 95523 00009 కు మెసేజ్ చేయడం ద్వారా లేదా పాఠశాల విద్యాశాఖకు చెందిన 'లీప్' యాప్ ద్వారా కూడా సులభంగా హాల్ టికెట్లు పొందే వెసులుబాటు కల్పించారు. వెబ్‌సైట్‌లో జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి హాల్ టికెట్ ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. హాల్ టికెట్ల జారీకి సంబంధించి బోర్డు ఎటువంటి ప్రైవేటు ఏజెన్సీలకు గానీ, థర్డ్ పార్టీ వెబ్‌సైట్లకు గానీ అనుమతి ఇవ్వలేదని అధికారులు స్పష్టం చేశారు. కేవలం అధికారిక మార్గాలను మాత్రమే ఎంచుకోవాలని, అనధికారిక లింకులను నమ్మవద్దని సూచించారు. హాల్ టికెట్లలో ఏవైనా తప్పులు ఉన్నా, సందేహాలు ఉన్నా వెంటనే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు అధికారులు సూచించారు.

# బీర్లు తెగ తాగేస్తున్నారు..!!

అయితే, ఈ ఏడాది ఆ రికార్డును కూడా తిరగరాసేలా బీర్ల అమ్మకాలు జరుగుతున్నాయి.ఈ ఏడాది ఎండలు ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. కానీ, మధ్యాహ్నం మాత్రం భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో బీరు ప్రియులు చల్లటి బీర్లను వెతుక్కుంటూ వెళుతున్నారు. సాయంత్రమైందంటే చాలు.. వైన్స్ షాపుల వద్ద మద్యం కన్నా.. బీరు కొనుగోలు చేసేవారే ఎక్కువ మంది కనిపిస్తున్నారు. గత 15 రోజుల నుంచి బీర్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. గతేడాది కన్నా 36 శాతం మేర పెరిగి కొత్త రికార్డులను సృష్టించింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు, 1,205 బార్లు, 50కిపైగా క్లబ్బులు ఉండగా.. ఈ నెల మొదటి నాలుగు రోజుల్లోనే 8లక్షల కేసులకుపైగా బీర్ల విక్రయాలు జరిగాయి. ఈ పరిణామం రాష్ట్రంలో బీర్ల డిమాండ్‌ను తెలియజేస్తోంది. 2025 జనవరిలో 31లక్షల కేసుల బీర్ల అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది జనవరిలో అది 34 లక్షలకు పెరిగింది. ఇక, గత ఏడాది ఫిబ్రవరిలో 28 లక్షల కేసుల బీర్లు అమ్ముడవ్వగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ సంఖ్య ఏకంగా 38లక్షల కేసులకు చేరింది. అయితే ఎండలు ముదురుతుండటంతో ఫిబ్రవరి చివరి వారం నుంచి బీర్ల డిమాండ్ పెరిగిందని చెబుతున్నారు. 2025 మార్చిలో 31లక్షల కేసుల బీర్లు అమ్మగా.. ఈ సారి నాలుగు రోజుల్లోనే అందులో నాలుగో వంతు(8లక్షల కేసులు)ను చేరుకోవడం గమనార్హం. సూర్యప్రతాపం




పెరిగే కొద్దీ ఈ అమ్మకాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్‌శాఖ అంచనా వేస్తోంది. వాస్తవానికి ప్రతి ఏడాది బీర్ల అమ్మకాలు 450 లక్షల కేసుల నుంచి 500 లక్షల కేసుల వరకు జరుగుతాయి. ఈ ఏడాది మొత్తం మీద సాధారణ అమ్మకాల కంటే 15- 20 శాతం అదనంగా అమ్మకాలు జరగవచ్చునని అంచనా వేస్తున్నారు.

ఉత్పత్తి పెంచిన కంపెనీలు... ముందస్తు నిల్వలు

రాష్ట్రంలో బీర్ల డిమాండ్‌ను తయారీ కంపెనీలు ముందుగానే పసిగట్టాయి. అందుకు తగ్గట్టుగానే తమ ఉత్పత్తిని పెంచాయి. గత ఏడాదితో పోల్చితే 10 శాతం నుంచి 12 శాతం అదనపు ఉత్పత్తి సాధించేలా ఎక్సైజ్‌శాఖ చర్యలు చేపట్టింది. సాధారణంగా వేసవి కాలంలో గోదాముల్లో 15 రోజులకు సరిపడా బీర్ల స్టాక్ ఉంచుతారు. కానీ, ప్రస్తుత డిమాండ్ దృష్ట్యా ఏకంగా 35 రోజులకు సరిపడా నిల్వలను గోదాముల్లో ఉంచారు. అలాగే, బీర్ల ఎగుమతులపై కూడా ఎక్సైజ్ శాఖ ఆంక్షలు విధించింది. వాస్తవానికి ఏ కంపెనీ అయినా రాష్ట్ర సరఫరా కోటాను పూర్తి చేశాక.. మిగిలిన సరుకును ఇతర రాష్ట్రాల్లో అమ్ముకునే వెసులుబాటు ఉంది. కానీ, ఈ సారి డిమాండ్ అధికంగా ఉండడంతో ఇతర రాష్ట్రాలకు చేసే బీర్ల ఎగుమతులను ఎక్సైజ్ శాఖ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న బీర్ల అమ్మకాల వేగాన్ని చూస్తుంటే.. మే నెల నాటికి బీర్ల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇప్పటి నుంచే ముందు జాగ్రత్తగా పత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఏది ఏమైనా.. ఈ పరిణామం మాత్రం ఎక్సైజ్ శాఖకు, తద్వారా ప్రభుత్వ ఖజానాకు శుభసూచకంగానే సర్కారు భావిస్తోంది. సాధారణంగా ప్రభుత్వ ఖజానాకు అత్యధిక రాబడిని తీసుకొచ్చేది ఎక్సైజ్ శాఖేనన్నది తెలిసిన విషయమే. అయితే కొన్ని పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మాత్రం ఊహించిన దానికన్నా ఎక్కువ రాబడి ఎక్సైజ్ శాఖకు ఉంటుంది. కానీ, ఈసారి మాత్రం ఎండల కారణంగా బీర్ల అమ్మకాల ద్వారా గత రికార్డులన్నింటినీ బద్దలు కొడుతుండడంతో ఆ శాఖ అధికారులు తెగ సంబర పడిపోతున్నారు.

## యుద్ధ బీభత్సం

తమ యుద్ధ నౌకను ముంచేసినందుకు అమెరికా తీవ్రంగా పశ్చాత్తాప పడాల్సి వస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ హెచ్చరించారు. ఆ దేశ నౌకలను ఆ స్థాయిలో లక్ష్యం చేసుకుంటామని ప్రకటించిన కాసేపటికే ఐఆర్‌జీసీ నుంచి దాడి వార్త వెలువడింది. అమెరికా మాత్రం తమ చమురు నౌకపై దాడి జరిగినట్టు ధ్రువీకరించలేదు. అంతేగాక దక్షిణ ఇరాన్‌లోని కీలకమైన బందర్ అబ్బాస్ నౌకాశ్రయంపై అమెరికా యుద్ధ విమానాలు భారీస్థాయిలో విరుచుకుపడ్డట్టు తెలుస్తోంది. అక్కడ చాలాసేపటిదాకా భారీ స్థాయిలో పేలుళ్లు వినిపించినట్టు స్థానికులను ఉటంకిస్తూ మీడియా కథనాలు వెలువడ్డాయి. కీలకమైన హార్మూజ్ జలసంధికి బందర్ అబ్బాస్ అతి సమీపంలో ఉంటుంది. హార్మూజ్‌ను ఇరాన్ ఇక్కడినుంచే నియంత్రిస్తూ ఉంటుంది. మరోవైపు కువైట్‌లో కూడా ఒక చమురు నౌకపై దాడి జరిగింది. దాంతో అందులోని చమురు సముద్రంలోకి ఒలికిపోతున్నట్టు సమాచారం. ఇది కూడా ఇరాన్ పనేనని భావిస్తున్నారు! ఇరాక్‌లోని ఖోర్ అలా జుబెయిర్ నౌకాశ్రయం వద్ద బహమాస్‌కు చెందిన మరో చమురు నౌకపైనా ఇరాన్‌కు చెందిన బోటు ఆత్మాహుతి దాడికి దిగింది. యుద్ధం మొదలైనప్పటి నుంచీ గల్ఫ్ ప్రాంతంలో దాడుల బారిన పడ్డ చమురు నౌకల సంఖ్య 9కి చేరింది.

**గల్ఫ్ దేశాలపైకి ఇరాన్ డ్రోన్లు!**

అమెరికా తమ యుద్ధ నౌకను ముంచేసిన కాసేపటికే ఇరాన్ రెచ్చిపోయింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై బుధవారం అర్ధరాత్రి నుంచే దాడులను తీవ్రతరం చేసింది. దాంతో జెరూసలేం, టెల్ అవీవ్‌తో పాటు పలు నగరాల్లో జనం వేలాదిగా బంకర్లలో తలదాచుకుంటున్నారు. పదులకొద్దీ క్షిపణులు, డ్రోన్లను అడ్డుకుని నేల కూల్చినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. యూఏఈ, ఖతర్‌తో పాటు దోహాలోని అమెరికా సైనిక స్థావరాలపైనా ఇరాన్ ఎడాపెడా డ్రోన్ దాడులకు దిగింది. ఆరు ఖండాంతర క్షిపణులతో పాటు 125 డ్రోన్లను అడ్డుకుని కూల్చేసినట్టు యూఏఈ ప్రకటించింది. అబుదాబిలో డ్రోన్ శకలాలు పడి ఆరుగురు గాయపడ్డారు. దాడుల నేపథ్యంలో దోహాలోని అమెరికా రాయబార కార్యాలయం సమీప ప్రాంతాలను ఖతర్ ఖాళీ చేయించింది.

## లిక్కర్ కేసు కొట్టేయడంతో స్వామికి మొక్కు

తిరుపతి,మార్చి5(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తిరుమలకు కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకునేందుకు తిరుపతి చేరుకున్నారు. తిరుపతిలోని అలిపిరి వద్ద నుంచి కాలినడకన తిరుమల బయల్దేరిన ఆమె.. ముందుగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.. గత నాలుగేళ్లుగా చేయని తప్పుకు తాను మానసిక వేదన అనుభవించానని కవిత తెలిపారు. అయితే దేవుడి దయతో తనపై ఉన్న కేసును కోర్టు పూర్తిగా కొట్టివేసిందని చెప్పారు. ఆ కేసు నుంచి విముక్తి లభిస్తే కాలినడకన తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటానని మొక్కుకున్నానని, ఆ మొక్కును తీర్చుకోవడానికి ఇప్పుడు తిరుమలకు వచ్చానని వెల్లడించారు. అదే సమయంలో తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రకటన చేశారు. మరో రెండు నెలల్లో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ పార్టీని స్థాపించనున్నట్లు చెప్పారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజలకు సేవ చేసే పార్టీగా దీనిని తీర్చిదిద్దుతామని కవిత తెలిపారు. తెలంగాణ ఫస్ట్ అనే నినాదంతో ప్రజల సమస్యలను మైక్రో లెవెల్‌లో పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను బీఆర్‌ఎస్ సరిగా నిర్వహించలేకపోయాయని ఆమె విమర్శించారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ ప్రజలపై తమకు ఎలాంటి ద్వేషం లేదని, రాజకీయ ఆధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకించామని కవిత స్పష్టం చేశారు. అలాగే హైడ్రా చర్యలపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. హైడ్రా పేదలను ఇబ్బంది పెట్టి పెద్దల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. తాను ఎప్పుడూ పేదల పక్షాన నిలబడి పోరాడతానని కవిత అన్నారు.

# ఆడబిడ్డ భద్రత--చదువుపై అవగాహన కార్యక్రమం

## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'బేటీ బచావో--బేటీ పఢావో' నిర్వహణ





మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 5: ఆడబిడ్డల సంరక్షణ, విద్యాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గాంధీనగర్ సెక్టార్‌లోని జడ్పీహెచ్ఎస్ ఇంగ్లీష్ మీడియంలో జరిగిన ఈ కార్యక్రమం సిడిపిఓ రేఖల మమత ఆదేశాల మేరకు జరిగింది. ఈ సందర్భంగా 'సోషల్ మీడియా ప్రభావం..బాలికలపై దుష్ప్రభావాలు' అంశంపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన బాలికలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. సూపర్వైజర్ నజీమ బేగం మహమ్మద్ మాట్లాడుతూ... మొబైల్ ఫోన్లలో వివిధ యాప్స్ ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల పేరుతో బాలికలు మోసాలకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని, అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాల్యవివాహాలపై కూడా అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగపిల్లలకు 21 సంవత్సరాలు నిండకముందు జరిగే వివాహాలు బాల్యవివాహాలుగా పరిగణించబడతాయని, అలాంటి వాటికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆడబిడ్డల రక్షణ, విద్య కోసం ప్రభుత్వం పలు సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. ఎలాంటి ఆపద వచ్చినా ఆశ్రయం కల్పించేందుకు బాలసదనాలు ఉన్నాయని, అవసరమైతే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గుడ్ టచ్..బ్యాడ్ టచ్, అక్రమ దత్తతలపై జాగ్రత్తలు, స్కూల్ డ్రాప్‌ఔట్‌ల నివారణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెడ్‌మిస్ట్రెస్ విజయకుమారి, ఉపాధ్యాయులు సుకన్య, జ్యోతి, అంగన్వాడీ టీచర్లు యల్లమ్మ, వాణి, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సిఐకి వినతిపత్రం అందజేత

### రోడ్లు పూర్తయ్యే వరకు చాలానా నిబంధనలను సడలించాలి...

### ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

### చిలకల శ్రీనివాస యాదవ్



**చౌటుప్పల్.మార్చి 5. క్రైమ్ మిర్రర్:** చౌటుప్పల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం చలానాల విషయంలో సడలింపు కల్పించాలని కోరుతూ బీసీవై పార్టీ పిఎసి రాష్ట్ర సభ్యుడు చిలకల శ్రీనివాస్ యాదవ్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చౌటుప్పల్ పట్టణంలో ప్రస్తుతం హైవే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా పెరిగాయని, రహదారులు పూర్తిగా సరిగా లేకపోవడం, ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసులు ఫోటోలు తీసి చలానాలు విధించడం ప్రజలకు మరింత ఇబ్బందిని కలిగిస్తోందన్నారు. చౌటుప్పల్ లో తగినంత ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని కోరారు. రోడ్ల పక్కన పార్కింగ్ చేస్తున్న వాహనాలను నియంత్రించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలిని, రోడ్లు పూర్తయ్యే వరకు చలానా నిబంధనలను సడలించాలని కోరారు . లేకపోతే బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు . ఈ కార్యక్రమములో పార్టీ నాయకులు అడెపు బిక్షపతి, శ్రీనివాస్ సర్వైల్,నారి స్వామి,శేఖర్,రాజేష్ పాలుగొన్నారు.





# ఘనంగా భట్టి తనయుడి వివాహం

### సిఎం రేవంత్ తదితర ప్రముఖుల హాజరు



హైదరాబాద్,మార్చి5(ఆర్ఎన్ఎ): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం వైభవంగా జరిగింది. శంషాబాద్ లో జరిగిన వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారిని అభినందించారు. గవర్నర్ విజ్ణుదేవ్ వర్మ, నటుడు చిరంజీవి తదితర ప్రముఖులు కూడా వివాహ వేడుకకు హాజరయ్యారు. పలువురు మంత్రులు, మాజీమంత్రులు కూడా హాజరయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. బంధుమిత్రుల సమక్షంలో భారీ జనసందోహం మధ్య వీరి వివాహం ఘనంగా జరిగింది.

## అసెంబ్లీలో అందరూ ఉంటేనే సమస్యలపై చర్చ

### ఎపి స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్య

అమరావతి: అసెంబ్లీలో అందరూ ఉంటేనే మసాలా ఉంటుందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. చర్చలు జరిగితేనే ప్రజల సమస్యలపై పరిష్కారానికి అవకాశం వస్తుందన్నారు. విపక్షం దీనిని ఉపయోగించుకోలేక పోయిందని అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో స్పీకర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల కోసమే ఎమ్మెల్యేలు ఎన్నికవుతారని... అలాంటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అయిన అసెంబ్లీకి గైర్హాజరు సబబు కాదని అన్నారు. వైసీపీలో జగన్ మోహన్ రెడ్డి మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని స్పీకర్ గుర్తు చేశారు. వైసీపీ సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే తగిన సమయం రావాలన్నారు. అనర్హత వేటు అంశం ఆంధ్రప్రదేశ్‌లో సక్సెస్ అయితే దేశవ్యాప్తంగా సక్సెస్ అవుతుందని స్పీకర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వచ్చినా అది హాజరుగా పరిగణించాలనే నిబంధన ఎక్కడ ఉందో 'నెంబర్ వన్ స్టూడెంట్' అని చెప్పుకునేవాళ్లు చూపించాలని సవాల్ విసిరారు. గవర్నర్ ప్రసంగం రోజు అసెంబ్లీకి వస్తే.. అది హాజరుగా పరిగణించబడదని స్పష్టం చేశారు. అడ్డగోలు వాదనలు చేసే వారిని ఏమనాలని స్పీకర్ ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డికి దక్కాల్సిన అన్ని గౌరవ మర్యాదలు లభిస్తున్నాయని అయ్యన్నపాత్రుడు చెప్పారు. జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందరు ఎమ్మెల్యేలతో సరదాగా ఉండేవారని గుర్తు చేశారు స్పీకర్.



## అమెజాన్ డేటా సెంటర్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ యోగేష్ గౌతమ్




**క్రైమ్ మిర్రర్ షాబాద్:** చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఈరోజు హైతాబాద్ లోని అమెజాన్ డేటా సెంటర్‌ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను పరిశీలించారు. డేటా సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న సెక్యూరిటీ ఏర్పాట్లు, సీసీ కెమెరాల వ్యవస్థ మరియు పోలీసుల విధుల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం షాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ యోగేష్ గౌతమ్ అక్కడి పోలీసు సిబ్బందితో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా భద్రతా చర్యల్లో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక షాబాద్ ఇన్స్పెక్టర్ ఏ కాంత రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, హెడ్ కానిస్టేబుల్ వడ్ల చంద్రశేఖర్, ఇతర పోలీస్ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు..

# నేటి నుంచి 99 రోజుల ప్రజాపాలన

### ప్రత్యేక లోగో ఆవిష్కరించిన ప్రభుత్వం

హైదరాబాద్, : 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోగోను ప్రభుత్వం ఆవిష్కరించింది. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగనున్నారు. మార్చి 6 నుంచి ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుజిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక నిర్వహణపై జిల్లా కలెక్టర్లకు ఇటీవలే సిఎం నిర్దేశం చేశారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక అయిదు దశల్లో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమ నిర్వహణపై ఉమ్మడి జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్చార్జి మంత్రితో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి, ఈ సమావేశానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. ఈనెల 12 వ తేదీన ఆయా జిల్లాల్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు , సర్పంచులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని అన్నారు. ఇందుకుగాను పంచాయితీ రాజ్, మున్సిపల్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాయని అన్నారు. ఈ 99 రోజుల ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని మరోసారి తెలిపారు. దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు తగు మార్గ దర్శకాలను జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## 8నుంచి విమెన్ హాకీ కప్ టోర్నమెంట్

### అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వెల్లడి

హైదరాబాద్: ఈ నెల 8 నుండి గచ్చిబౌలి హాకీ స్టేడియం లో నిర్వహిస్తున్న ఉమెన్ వరల్డ్ హాకీ కప్ -2026 క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట క్రీడా, యువజన సర్వీసులు, పశు సంవర్ధక, మత్స్య శాఖా మంత్రివర్యులు వాకిటి శ్రీహరి వెల్లడించారు. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ కె శివ సేనా రెడ్డి, సోని బాల మాయాదేవి, ఇతర క్రీడాధికారులు పాల్గొన్నారు. గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. హాకి లో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ధ్యాన్ చంద్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాల్గి÷ వుమెన్ హాకీ టోర్నమెంట్ 2026 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసాము. మార్చి 8 నుంచి 14 వరకు జరిగే ఈ పోటీలు గచ్చిబౌలిలోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే,వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లు ఇప్పటికే హైదరాబాద్ చేరుకుని, గచ్చిబౌలి లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాయి. మహిళల వరల్డ్ కప్ హాకీ క్వాల్గి÷యైర్స్ 2026 కి ఈ పోటీలు కీలకంగామారనున్నాయి. టోర్నమెంట్‌ను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని సదుపాయాలను సమకూర్చింది. క్రీడాకారుడు అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గచ్చిబౌలి నందు అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోటర్ఫ్ మైదానం, హై సెక్యూరిటీ, ఆధునిక సదుపాయాలు, క్రీడాకారులకు అత్యుత్తమ వసతి ఏర్పాట్లు చేయబడ్డాయి. ఇప్పటికే ఈ టోర్నమెంట్లో పాల్గొనబోతున్న అన్ని జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఘనంగా స్వాగత సత్కారాలు చేసింది. దానితోపాటు ప్రాక్టీస్‌కు కావలసిన అన్ని వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల వసతి సదుపాయాలు అందుబాటులో ఉంచడం జరిగింది. అన్ని జట్ల క్రీడాకారిణిలు ఆధునికరించిన గచ్చిబౌలి ఆస్ట్రోటర్ఫ్ స్టేడియంలో బ్రహ్మాండంగా ప్రాక్టీస్ చేస్తున్నారు.

# ఇల్లు కట్టడానికే పర్మిషన్ ఇవ్వరు...

### అలాంటి క్రషర్ పెట్టి ఏకంగా కొండలనే కొల్లగొడుతున్నారు

### పేదలకు వర్తించిన111 జీవో మంత్రికి ఎందుకు వర్తించదు

### ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలు



గండిపేట(క్రైం మిర్రర్): ఇల్లు కట్టడానికే పర్మిషన్ ఇవ్వని శంషాబాద్ 111 జీవో పరిధిలో క్రషర్‌లు పెట్టి ఏకంగా కొండలనే కొల్లగొడుతున్నారని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలు అన్నారు. శంషాబాద్ కొత్వాల్‌గూడలో అక్రమ మైనింగ్ క్రషర్లను గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బరితెగించిందో అర్థం అవుతుందన్నారు. ఇప్పుడు హైడ్రా ఎక్కడికి పోయిందని నిలదీశారు. పేదలకు వర్తించని 111 జీవో మంత్రి పొంగులేటికి ఎందుకు వర్తించదన్నారు. కేజీఎఫ్ సినిమా తరహాలో గుటగ్టలను తవ్వుతూ అక్రమ మైనింగ్ మాఫియా క్రషర్‌లు నడుపుతున్నారన్నారు. వందల కోట్లు సంపాయిస్తున్న అధికారులు మాత్రం చూసి పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ క్రషర్ మంత్రికి సంబంధించినది అందుకే అధికారులు అక్కడికి వెళ్లడానికి కూడా భయపడుతున్నారన్నారు. జీవో 111 నిబంధనలు పూర్తిగా ఉల్లంఘిస్తూ క్రషర్‌లు నడుస్తున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1999లో మూతపడిన క్రషర్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా మళ్లీ ప్రారంభించారని, అధికారులకు డబ్బులు ఇచ్చి మైనింగ్ మాఫియా వ్యవహారాన్ని సైలెంట్ చేస్తున్నారని ఆరోపించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిద్రలో ఉందా..? ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందా..? అంటూ బీఆర్ఎస్ నేతుల తీవ్రంగా మండిపడ్డారు. వెంటనే తగిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.



# అంగన్వాడీ లో ఆరోగ్య లక్ష్మి సమావేశం

**నూతనకల్( క్రైమ్ మిర్రర్):** మండలంలోని సోమ్లాతండా అంగన్వాడీ కేంద్రంలో గురువారం ఆరోగ్య లక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ పద్మ మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఆహారంలో ఆకుకూరలు, పప్పు, గుడ్లు తప్పనిసరిగా చేర్చుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు గుగులోత్ కమల, భారతి, పంచాయతీ కార్యదర్శి బి.వెంకన్న,చిన్నారుల తల్లులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ పై క్రిమినల్ కేసు నమోదు.

### ప్రజాపంపిణీ వ్యవస్థలో లోపాలు జరిగితే చర్యలు తప్పవు.

### జిల్లా సివిల్ సప్లై అధికారి చందన్ కుమార్ వెల్లడి



**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** రేషన్ షాపులో బియ్యం నిల్వలు తక్కువగా వున్న కారణంగా ఒక రేషన్ డీలర్ షాపు డీలర్ పై క్రిమినల్ కేసు నమోదు జరిగిన సంఘటన ఖమ్మం జిల్లాలో చోటు చేసుకుంది. చింతకాని మండలం, నాగిలిగొండ గ్రామంలో జిల్లా సివిల్ సప్లై అధికారి చందన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపులో నిల్వల లోపం - డీలర్స్ పై 6ఎ కేసు తో పాటు క్రిమినల్ కేసు కూడా నమోదు చేశారు. గురువారం ఖమ్మం జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి (డి సి యస్ ఒ) ఖమ్మం చింతకాని మండలంలోని నాగిలిగొండ గ్రామంలో గల రేషన్ షాపు (2242005)ను ఆకస్మిక కంగా తనిఖీలో లోపాలు బహిర్గతం కావడంతో కేసుల పర్వం మొదలైంది. ఈసందర్భశీగా

**జిల్లా సివిల్ సప్లై అధికారి చందన్ కుమార్ మాట్లాడుతూ.ప్రజాపంపిణీ**

ప్రజలకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేసే బాధ్యత ప్రతి రేషన్ డీలర్ పై ఉందని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.. షాపులో నిల్వ ఉండవలసిన 112.61 క్వింటాళ్ళ సరుకుకు బదులుగా 52.50 క్వింటాళ్ళు మాత్రమే ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, 60.11 క్వింటాళ్ళు నిల్వ తక్కువగా ఉన్నట్లు తేలడంతో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు డి సి ఎస్. ఓ చందన్ కుమార్ వెల్లడించారు. ఇది పేదల హక్కులను హరించే విధంగా వ్యవహరించిన వారిపై కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలోని అన్ని రేషన్ షాపుల డీలర్లు సక్రమంగా రేషన్ బియ్యంను పంపిణీ చేయాలని, నిల్వలలో తేడా వస్తె చర్యలు తప్పవన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్దిదారులకు చేరాల్సిన నిత్యావసర సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం, అవినీతి జరిగితే చట్టపరమైన చర్యలుశీటాయన్నారు. రేషన్ బియ్యం దారి మళ్లించడం కూడా నేరమేనని ఆయన అన్నారు.జిల్లాలోని అన్ని రేషన్ షాపులపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై యాక్షన్ ఉంటుందని తెలిపారు.

# రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**చౌటుప్పల్, మార్చి 5 క్రైమ్ మిర్రర్ :** కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేయనున్న అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి లకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన మద్దతు తెలిపారు. హైదరాబాద్ లోని అసెంబ్లీ ఆవరణలో అభిషేక్ మను సింగ్వి, వేం నరేందర్ రెడ్డి లు తమ నామినేషన్లను దాఖలు చేయగా వారికి మద్దతుగా నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



# స్నేహితురాలినే బురిడీ కొట్టించిన కిలాడీ లేడీ

### మెడలో పుస్తెల త్రాడు, సెల్ ఫోన్ అపహరణ... కేసును ఛేదించిన రామకృష్ణాపూర్ పోలీసులు



**రామకృష్ణాపూర్, మార్చి 5 (క్రైమ్ మిర్రర్):** పాత పరిచయాన్ని ఆసరాగా చేసుకుని స్నేహితురాలినే నమ్మించి మోసం చేసి మెడలోని బంగారు పుస్తెల త్రాడు, సెల్‌ఫోన్ అపహరించిన మహిళను రామకృష్ణాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్శ రమేష్ గురువారం వెల్లడించారు.గోదావరిఖనిలోని ఐబీ కాలనీకి చెందిన గాజాంగి శ్రావణికి, శ్రీరాంపూర్‌కు చెందిన శ్రీరాంభట్ల మనస్విని (అలియాస్ లాస్య)తో గతంలో పరిచయం ఉంది. ఈ నెల 2న నిందితురాలు శ్రావణిని మభ్యపెట్టి గోదావరిఖని నుంచి రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి సమీపానికి తీసుకువచ్చింది. అక్కడ బాధితురాలు టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో వెనుక నుంచి దాడి చేసి కిందకు నెట్టేసి, మెడలోని బంగారు పుస్తెల త్రాడు, కిందపడిన మొబైల్ ఫోన్‌ను తీసుకుని ఆటోలో పరారైంది.బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పర్యవేక్షణలో రామకృష్ణాపూర్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితురాలి ఆచూకీ కనుగొన్నారు.గురువారం మధ్యాహ్నం మంచిర్యాలలోని ముఖారం చౌరస్తా వద్ద దొంగిలించిన ఆభరణాలను అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా ఎస్సై జె. శ్రీధర్, పోలీసు సిబ్బంది నిందితురాలిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**జల్సాలకు అలవాటు...**

పోలీసుల విచారణలో నిందితురాలు శ్రీరాంభట్ల మనస్విని (22) జల్సాలకు అలవాటు పడి భర్త, కొడుకును వదిలి మంచిర్యాలలోని ఓ హాస్టల్‌లో నివసిస్తున్నట్లు తేలింది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో స్నేహితురాలినే మోసం చేసి ఈ దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితురాలి వద్ద నుంచి దొంగిలించిన బంగారు పుస్తెల త్రాడు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసును తక్కువ సమయంలోనే ఛేదించి నిందితురాలిని పట్టుకున్న రామకృష్ణాపూర్ అందజేశారు శ్రీధర్, పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించి రివార్డులు అందజేశారు .

# అప్పారెడ్డిగూడ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం -- ముఖ్య అతిథిగా ఎలుగంటి మధుసూదన్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్య అతిథిగా ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొని ఘనంగా ప్రారంభించారు. గ్రామాభివృద్ధి దిశగా చేపట్టిన ఈ కార్యక్రమాలు గ్రామస్తుల్లో ఆనందాన్ని నింపాయి. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ కరెంట్ లైన్‌ను ప్రారంభించారు. దీని ద్వారా గ్రామంలోని పలువురు కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం మరింత మెరుగుపడనుంది. అనంతరం గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ ప్లాంట్ ద్వారా గ్రామస్తులకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుబాటులోకి రానుంది.అదేవిధంగా ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇల్లును కూడా ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని ఆయన తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఏఈ శ్రీనివాస్, సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, సర్పంచులు సందీప్ గౌడ్, నవనీత స్వామి, శాంతమ్మ యాదయ్య, సవిత సుభాష్ చంద్రతో పాటు నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, అశ్విని, కిషోర్, నర్సింహా రెడ్డి, సంజీవ్ రెడ్డి, సూర్య, రఫీక్, శేఖర్, దయాకర్ మరియు ఇతర పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి మరిన్ని పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

# బీరు సీసాతో యువకుడిపై దాడి

### హోలీ గొడవ పాత కక్షగా మారి

### హత్యాయత్నం -- ఇద్దరు అన్నదమ్ములు అరెస్ట్



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మార్చి 5: మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్ కాలనీలో బీరు సీసాతో యువకుడిపై దాడి జరిగిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పాత గొడవను కారణంగా చూపుతూ ఇద్దరు అన్నదమ్ములు ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.వన్‌టౌన్ సీఐ నాగభూషణరావు వివరాల ప్రకారం... కాలనీకే చెందిన ఎల్తూరి అఖిల్ వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా, అదే ప్రాంతానికి చెందిన పందిరి ఆకాశ్, వికాస్‌లు హోలీ రోజు జరిగిన గొడవను ప్రస్తావిస్తూ అతనితో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.అఖిల్ అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించగా, ఆకాశ్ బీరు సీసాతో దాడి చేసి అతని మెడపై పొడిచినట్లు సమాచారం. తీవ్ర గాయాలపాలైన అఖిల్‌ను అదే సమయంలో అక్కడుగా వెళ్తున్న చెరుకుపల్లి సురేష్ తన బైక్‌పై ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడినట్లు తెలిసింది.గురువారం బాధితుని ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి, వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెల్లడించారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 6-3-2026


# రైతులు సేంద్రియ పద్ధతులను అనుసరించాలి

**పకృతి వ్యవసాయం పైన అవగాహన సదస్సు...**

**మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్**




**చౌటుప్పల్,మార్చి 05, క్రైమ్ మిర్రర్:** రైతులంతా సేంద్రీయ పద్ధతులను అనుసరిస్తూ పంటలు పండించాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ అన్నారు.గురువారం ప్రకృతి వ్యవసాయంపైన మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చౌటుప్పల్ పురపాలక చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్ ,ప్రధాన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి , పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ... తంగడపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీసుకొని రైతులందరూ సేంద్రీయ పద్ధతులను అనుసరించాలని కోరారు.రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడిని పొందాలని అన్నారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ... రైతులందరూ వాడే విత్తనాలు దేశ విత్తనాలు సేకరించి వాటిని ఉపయోగించవలసిందిగా కోరారు. సేంద్రియ పద్ధతిలో ఒక రైతు కనీసం 10 గుంటల పొలంలోనైనా తన ఇంటికి సరిపడా వరి ధాన్యాన్ని పండించవలసిందిగా కోరారు. పెట్టుబడికి సంబంధించి ఇతర రసాయనాల మీద ఆధారపడకుండా, జీవామృతం రైతులే తయారు చేసుకుని వాడవల్సిందిగా కోరారు. యూరియా వాడకం తగ్గించి దానికి బదులు వేప పిండి వాడటం వలన వరి పైరు కంకులు మొత్తం ఒకేసారి రావడం జరుగుతుందని అలాగే చీడపీడల ఉధృతి తగ్గుతుంది అని తెలిపారు.అనంతరం వ్యవసాయ మండల అధికారి మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని, అధికంగా ఎరువులు పురుగు మందులు వాడడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని భూమి సారం తగ్గుతుందని తద్వారా పంట దిగుబడులు తగ్గుతున్నాయని అన్నారు. రైతులు జీవామృతం, ఘన జీవామృతం వేస్ట్ డీకంపోజర్ వంటి పద్ధతులు ఉపయోగిస్తూ ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులకు తెలిపారు. పెద్ద కొండూరు గ్రామానికి సంబంధించిన వాకిటి రజిత రైతు గత పది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న విధానాన్ని, మెలుకువలను, సేంద్రియ విధానంలో తనకు గల అనుభవాన్ని తోటి రైతులకు తెలిపారు. రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు,ఊదరి యాదయ్య, ఆలే శ్రీలత చిరంజీవి,తంగడపల్లి గ్రామ రైతులు,కృషి సఖీస్, వ్యవసాయవిస్తరణ అధికారులు పాల్గొన్నారు.



# సుర్వి శంకరయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన-దండుగుల నగేష్

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 05(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన సుర్వి శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందాడు.వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయంగా(10000) పదివేల రూపాయలను అందజేసిన దండుగుల నగేష్ .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పల రమేష్ ,వార్డు మెంబర్లు ఆరుట్ల రాజు,మాజీ వార్డ్ మెంబర్లు సుర్వి దయాకర్,వెంకటాచారి, బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు బోడ శివ, తెరాస గ్రామ శాఖ అధ్యక్షులు బోడ రాజు సుర్వి నరేష్,సుర్వి కుమార్, మొగుదాల యాదయ్య, సప్పిడి నర్సిరెడ్డి,మొగుదాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలోని 9 గ్రామాలలో రీ సర్వే



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** మండలంలోని 9 గ్రామాలలోని భూములను రీసర్వే చేయటం కొరకు ప్రభుత్వము గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని తహాసిల్దార్ శ్రీనివాస రావు తెలిపారు. ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ లో సూచించిన పెదనెమిల, ఎర్రపహాడ్ ,నూతనకల్, దిర్శనపల్లి, చిల్పకుం ట్ల,మిర్యాల,మాచ నపెల్లి,గుండ్ల సింగారం, యడవల్లి గ్రామాలలో అన్ని భూములను రీ సర్వే నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. సర్వే పనులు త్వరలోనే ప్రారంభించి గ్రామసభలు నిర్వహించటం జరుగుతుందని అన్నారు.సర్వేకు రైతులు ప్రజలు అందరూ సహకరించాలని కోరారు.సర్వే ద్వారా ప్రభుత్వ భూములను కాపాడుకోవడం అన్ని రకాల భూములలో భూతగాదాలు రాకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుంది అని తెలిపారు.



# చేవెళ్ల మండలంలో ఆలయాల అభివృద్ధికి డా. వైభవ్ రెడ్డి విరాళం

**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని నాంచెరి గ్రామంలో ఉన్న మల్లన్న, బీరప్ప ఆలయాల అభివృద్ధి కోసం డాక్టర్ వైభవ్ రెడ్డి తన వంతుగా రూ.50,000లను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని నాంచెరి గ్రామ సర్పంచ్ అశోక్‌కు అందజేసి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు.అదేవిధంగా చేవెళ్ల మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఈదమ్మ గుడి నిర్మాణం మరియు అభివృద్ధి కార్యక్రమాల కోసం మరో రూ.50,000లను విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని బీజేపీ నాయకుడు ప్రకాశ్ గౌడ్‌కు అందజేశారు. ఆలయాల అభివృద్ధి కోసం ఆయన చేసిన ఈ సహాయం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు డాక్టర్ వైభవ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లోని దేవాలయాల అభివృద్ధి కోసం ఆయన చూపిస్తున్న సేవాభావం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ఆలేరు జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ**

**పరీక్ష కేంద్రాలలో మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా,మార్చి 05, క్రైమ్ మిర్రర్ :** ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు . గురువారం ఆలేరు మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ...మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు . పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. హాజరు వివరాలు,సీసీ కెమెరా పని తీరు, త్రాగు నీరు, వైద్య సదుపాయంల గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు. మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జవాబు పత్రాల రవాణాకు పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.




# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు దొంగలను పట్టుకున్న పోలీసులు

## రూ. 6 లక్షలు నగదు, సెల్ ఫోన్ లు స్వాధీనం

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు దొంగలను పట్టుకొని రిమాండ్ కు తరలించినట్లు డిఎస్పి వెంకట్ రెడ్డి తెలిపారు. కల్వకుర్తి డిఎస్పి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి డిఎస్పి వెంకట్ రెడ్డి వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల్లో మధ్యాహ్నం పూట రెక్కి నిర్వహించి ఎవరూ లేని సమయంలో తాళాలు వేసి ఉన్న ఇండ్లను ఎంచుకొని తాళాలు పగలగొట్టి బీరువాలలో ఉన్న నగదు, బంగారాన్ని ఎత్తుకెళ్లే దొంగల ముఠా ఆరుగురిని కల్వకుర్తి, వెల్దండ, వంగూరు, మండలాల పోలీసులు పట్టుకున్నారు. కల్వకుర్తి డిఎస్పి వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొలుకులపల్లి నాగేష్, పుట్ట వెంకటయ్య, కుంచపు సైదులు, వెల్దండ మండలం గుండాల గ్రామానికి చెందిన చెందిన పెరుమాళ్ళ రామస్వామి, దొడ్డి యాదయ్య, ఎనుముల జంగయ్య మొత్తం ఆరుగురు కలిసి ఒక ముఠాగా ఏర్పడి ఈజీ మనీ కోసం దొంగతనాలు చేయడం ప్రారంభించారు. వంగూరు మండలం సర్వారెడ్డిపల్లికి చెందిన చిన్న పుల్లయ్య ఇంట్లో అర తులం బంగారం నాలుగు లక్షల పదివేల రూపాయల నగదు, అచ్చంపేట మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన రెడ్డి మోని సైదులు ఇంట్లో రూ.5,80,000 లు ఆరున్నర తులాల బంగారం, నాగర్ కర్నూల్ పట్టణం ఈశ్వర్ కాలనీకి చెందిన చంద్రకళ ఇంట్లో నాలుగు తులాల బంగారం, కల్వకుర్తి పట్టణం



పిరిమేరి తిరుపతమ్మ ఇంటిలో మూడు తులాల బంగారం దొంగతనం చేసి ఎత్తుకెళ్లారు. దొంగలు తాళాలు వేసిన ఇండ్లను, ఇంట్లో ఒంటరిగా ఉన్న స్త్రీలను ఎంచుకొని దొంగతనాలకు తెగించారు. వెల్దండ సీఐ, వంగూరు ఎస్సై తమ సిబ్బందితో కలిసి వంగూరు మండలం శ్రీశైలం క్రాస్ రోడ్డు దాబా దగ్గర అనుమానితులుగా ఉన్న దొంగలను పట్టుకొని విచారించి వారి దగ్గర నుండి ఆరు లక్షల నగదు,కారు, 6 మొబైల్ ఫోన్లు ఒక ఐరన్ రాడ్, ఒక స్క్రూ డ్రైవర్ స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ కు తరలించామని డిఎస్పి తెలిపారు.



## ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ని కలిసిన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్ ..

**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంచార్జీ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ పార్టీ మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా డివిజన్‌లోని పార్టీ బలోపేతం, పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారితో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,బిక్షపతి ముదిరాజ్ , రాహుల్ , నీలేష్, అఖిల్, శ్రీకాంత్, బంటీ, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# ఉన్నత లక్ష్యాల సాధన కోసం నిరంతరం శ్రమించాలి





### ఆలేరు ఎస్సీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుంది... జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి జిల్లా,మార్చి 05, క్రైమ్ మిర్రర్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వాటి సాధన కోసం నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం ఆలేరు మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ని కలెక్టర్ సందర్శించారు. స్కూల్ లో ఎంతమంది విద్యార్థులు చదువు తున్నారని, ఇంటర్మీడియట్ లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని సంబంధిత ప్రిన్సిపాల్ ని అడిగి తెలుసుకున్నారు . ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారని . అందరూ ఇక్కడే ఉంటారా లేక వెళ్లి వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.ఈ రోజు మెనూ ప్రకారం ఆహారం వండడం జరిగిందా అని పరిశీలించారు.రోజు మెనూ ప్రకారం భోజనం రుచిగా పెడుతున్నారా లేదా అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నన భోజనాన్ని కలెక్టర్ రుచి చూసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.స్టోర్ రూమ్ లో ఉన్న బియ్యం, కూరగాయలు, వంట సరుకులను పరిశీలించారు.కూరగాయలు, గుడ్లు ఫ్రెష్ గా ఉన్నాయా లేవా అని పరిశీలించారు.ఆర్వో వాటర్ ఫిల్టర్ ను వాటర్ యొక్క క్వాలిటీని రెగ్యులర్ గా చెక్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పైనంపల్లిలో టిఆర్ఎస్ సానుభూతిపరులు మృతి

### పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య నివాళి

**ఖమ్మం(క్రైమ్ మిర్రర్ బ్యూరో)** నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సానుభూతిపరులు తాళ్లూరి అంజయ్య, పెదవల్లి రుక్మిణమ్మ గురువారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న పార్టీ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య వారి భౌతికకాయాలను సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన అంజయ్య, రుక్విణమ్మల ఆకస్మిక మరణం పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తీరని లోటు అన్నారు. వారు పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. వారి ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కోనాయిగూడెం సర్పంచ్ కోటి సైదారెడ్డి, తిరుమలాపురం సర్పంచ్ కమదన ప్రవీణ్, నాయకులు పాపినేని వెంకటనారాయణ, దాసరి ఉదయ్, సిద్దయ్య, పద్మారావు, మోహ లాల్ తదితరులు ఉన్నారు.

# నూతన ఎంఈవో నిరంజన్‌కు శుభాకాంక్షల వెల్లువ



**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిరంజన్ మండల విద్యాధికారి(ఎంఈవో)గా పదోన్నతి పొందారు. గురువారం ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మణికొండ, నెక్నాంపూర్ డివిజన్‌లకు చెందిన పలువురు నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కొండకల్ల రామకృష్ణారెడ్డి, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యా రంగంలో ఆయన చేసిన సేవలను ప్రశంసిస్తూ ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కూడా విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేవారు. ఈ కార్యక్రమంలో బి. రవి కాంత్ రెడ్డి, చిలుకూరి బీరప్ప, జొన్నాడ సిద్ధప్ప, శ్రీనివాస్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు....

# ఈ నెల 8న బమ్మకున్-ఉద్-దౌలా చెరువు ప్రారంభం

### సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి సన్నహం

### ఏర్పాట్లను పరిశీలించిన హైడ్రా కమిషనర్

గండిపేట(క్రైం మిర్రర్): చారిత్రక బమ్మకున్ - ఉద్ - దౌలా లేక్ ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ చెరువును ప్రారంభించనున్నారు. కూకట్‌పల్లిలోని నల్లచెరువు ప్రారంభోత్సవానికి కూడా ముహూర్తం ఖరారైంది. ఈ నెల 9వ తేదీన నల్లచెరువును ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బమ్మకున్-ఉద్-దౌలా చెరువును గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు సుందరీకరణ పనులను తిలకించారు. చెరువు కట్టతో పాటు ఖాళీ ప్రదేశాల్లో నాటిన ఔషధ మొక్కలను పరిశీలించారు. పిల్లలు ఆడుకునే ప్లే ఏరియాలతో పాటు అన్ని వయసులవారు సేద దీరేందుకు వీలుగా చెరువు కట్టపై ఏర్పాటు చేసిన గజబోలు(గుమ్మటాలు)ను చూశారు. పాతబస్తీ సంప్రదాయాలు ఉట్టి పడేలా ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, చెరువు చరిత్రను వివరించిన బోర్డులను పరిశీలించారు. చెరువును ప్రారంభించిన తర్వాత జరగనున్న సభ ఏర్పాట్లను కూడా హైడ్రా కమిషనర్ పరిశీలించారు. హైడ్రా అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్, అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో, పోలీసు శాఖ అధికారులు హైడ్రా కమిషనర్ వెంట ఉన్నారు.



# యువత సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి





**అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ ఆకస్మిక తనిఖీ...**

**విద్యార్థులు కొత్త ఆలోచనలతో సృజనాత్మకతను చాటాలి...**

**యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

యాదాద్రి భువనగిరి జిల్లా, మార్చి 5,క్రైమ్ మిర్రర్: యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా, సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకున్నప్పుడే యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.గురువారం ఆలేరు మండలంలో గల అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఏటిసిలో గల వివిధ రకాల కోర్స్ ల గురించి ప్రిన్సిపాల్ ను అడిగి ఉన్నారు. కలెక్టర్ విద్యార్థులతో పాటు ట్రైనర్లతో శిక్షణ పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ... ఈ సెంటర్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని, అందరూ రెగ్యులర్ గా వస్తున్నారా అని ప్రిన్సిపాల్ ని అడిగి తెలుసుకున్నారు.ఇక్కడ ట్రైనింగ్ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులకి ఇంటర్న్షిప్ కల్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.సెంటర్ లో ఉన్న మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్,ఆటోమేషన్ ,ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, అడ్వాన్స్ సి ఎస్ సి మిషనింగ్ టెక్నీషియన్,వంటి కోర్సులుపై విద్యార్థులకి ఇస్తున్న శిక్షణని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆలేరు ఐటిఐ ని పరిశీలించారు.ఇక్కడ ఏం కోర్సులు నేర్పిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండి, సరి కొత్త ఆలోచనలతో సృజనాత్మకతను చాటితే ఎంతో స్థాయికి చేరుకోవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మండల తాసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆర్‌జీఐఏలో క్యాబ్ డ్రైవర్లు, పారిశుధ్య, ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం





గండిపేట(క్రైం మిర్రర్): రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, శంషాబాద్‌లో ఏసీఎఫ్ శిబిరం ఆధ్వర్యంలో క్యాబ్ డ్రైవర్లు, విమానాశ్రయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య ఆరోగ్య సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లిమిటెడ్ సహకారంతో జరిగింది. ఈ సందర్భంగా విమానాశ్రయంలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి గొంతు పరీక్షలు, ఛాతీ ఎక్స్‌రేలు తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 300 మందికి పైగా కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వైద్య సూచనలు అందించారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడగా, కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి శిబిరాలు తరచుగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త సంచాలకులు డాక్టర్ రాజేశం, డాక్టర్ శ్రీ ఘన, డాక్టర్ ఎన్. అనిల్ కుమార్, డాక్టర్ పాయల్, డాక్టర్ నవీన్, డాక్టర్ ఆదిత్య, శ్రీనివాసులు, సురేష్, జితేందర్, జిల్లా కార్యక్రమ పర్యవేక్షకులు శ్రీనివాసులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విల్సన్, విజయ్ కుమార్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్వైజర్ నరేష్ కుమార్, టిబి ఆరోగ్య బృంద సభ్యుడు మధుబాబు, రహీం, సీనియర్ ప్రయోగశాల పర్యవేక్షకులు సలీం, సాగర్, శ్రీనివాస్ రెడ్డి, రేడియాలజిస్ట్ జయేందర్, త్రివేణి, అనిత, సురేఖ, ప్రసన్న లక్ష్మి, జిఎంఆర్ విమానాశ్రయ మేనేజర్ రామస్వామి, శ్రీనివాస్, సతీష్, ఏఎన్ఎం, ఆశ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు మంత్రి పొంగులేటి ఆశీర్వాదం

క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి : తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. తన నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో జరిగిన వివాహ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు పట్టు వస్త్రాలను కానుకగా అందించి, వారు "నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో చల్లగా ఉండాలి" అని దీవించారు. కూసుమంచి : మండల కేంద్రంలోని శ్రీ విజయరామ ఫంక్షన్



హాల్‌లో జరిగిన బోనగిరి వెంకటేశ్వరరావు కుమారుని వివాహ వేడుకకు మంత్రి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

**ఖమ్మం నగరం :** ఖానాపురంలోని మొగిలి పాపిరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఇంటూరి పుల్లయ్య కుమారుని పెళ్లికి, ఖమ్మం బైపాస్ రోడ్డులోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎంపీఓ చిప్పా శివ కుమార్తె వివాహానికి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు అందజేశారు.

**రెడ్డిపల్లి (ఏదులాపురం):** ఏఆర్ గార్డెన్స్‌లో జరిగిన మద్దినేని అశోకరావు కుమారుని వివాహ వేడుకలో పాల్గొని వధూవరులకు పట్టువస్త్రాలు బహూకరించారు. ఏన్కూరు ఒ తల్లాడ: ఏన్కూరు మండలం నాచారంలో ముక్తి వెంకటేశ్వర్లు కుమారుని వివాహానికి, తల్లాడ మండలం కుర్నవల్లిలో అయిలూరి శ్రీనివాసరెడ్డి కుమారుని వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను దీవించారు.

క్రైమ్ THE మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 3-6-2026


# భూ కబ్జాలపై ఆదేశాలు గాల్లో .... ప్రభుత్వం స్వాదీనం చేసుకునేనా....!




**ఎమ్మెల్యే ఆదేశాలు ఏమాయే .. ఆదేశాలు ఇచ్చిన .. పట్టించుకోరా**

**పలు సర్వే నంబర్లలో భూ కబ్జా.. మునుగోడులో యదేచ్ఛగా కబ్జాలు**

**ప్రభుత్వం అధీనంలోకి తీసుకునేనా**

**స్వాదీనం చేసుకొని,ప్రజా అవసరాలకి వినియోగించాలని విన్నపం**

**రెవెన్యూ అధికారులు స్పందించాలని కోరుతున్న ప్రజలు**




**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** ప్రభుత్వ భూమి కాలిగా కనపడితే చాలు వదిలే సమస్యలేదు. కాలిగా ఉంటే కబ్జా చేసుకోవడానికి నేను ఉన్నాను అంటారు.కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లు మునుగోడు గ్రామ పంచాయతీ ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి...అయితే మండల ,జిల్లా స్థాయి అధికారులకు వినతులు ఇచ్చిన పట్టించుకున్న నాధుడే కరువు..గ్రామ పంచాయతీ పరిధిలోని 10 వ, 45 వ, 78 సర్వే లలోని ప్రభుత్వ భూములను కొంతమంది వ్యక్తులు ప్రజాప్రతినిధుల అండతో కబ్జా చేసుకొని చేతులు మార్చినట్లు అనుమానిస్తున్నారు..ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి మునుగోడు కబ్జా భూముల గురించి తీసుకెళ్లగా..పలుమార్లు రెవెన్యూ,పంచాయతీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు.. కబ్జాకు గురయిన ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించి హద్దులు పాతి,కంచె ఏర్పాటు చేసి స్వాధీనంలోకి తీసుకోవాలని ,ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలను గుర్తించి నోటీసులు జారీచేసి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు..ఆదేశాలు ఇచ్చిన అధికారులు మొత్తానికి చర్యలు తీసుకోలేదన్న మాటలు ప్రజల్లో గట్టిగానే వినిపిస్తున్నాయి..ప్రజా అవసరాలకు నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వ కార్యాలయాలకు భూమి కొరత..కొంత మంది నాయకుల,మాజీ ప్రజాప్రతినిధుల,అధికారుల అండతో భూములు మాయమైనట్లు ప్రజల్లో గట్టి నమ్మకం..ఉన్నత అధికారులు ,స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వెంటనే స్పందించి కబ్జాకు గురయిన భూములను గుర్తించి స్వాదీనం చేసుకొని,ప్రజా అవసరాలకు ఉపయోగించాలని మునుగోడు ప్రజలు వేడుకుంటున్నారు..



# లింగోజిగూడెం జడ్పీహెచ్ఎస్ లో స్వయం పాలన దినోత్సవం

**చౌటుప్పల్,మార్చి 5, క్రైమ్ మిర్రర్:** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే అనుకున్న లక్ష్యం సాధిస్తారని ప్రధానోపాధ్యాయుడు కూరేళ్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం లింగోజిగూడెం గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు స్వయం పాలన దినోత్సవంను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూరెళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి స్వఅనుభవాన్ని పొంది ఉపాధ్యాయులగా తమ అనుభవాన్ని తోటి విద్యార్థులతో పంచుకున్నారు . అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వయం పాలన యొక్క ప్రాముఖ్యత, బాధ్యతలు నాయకత్వ గుణాల గురించి వివరించారు. విద్యార్థులు ఒకరోజు ప్రధానోపాధ్యాయులుగా వైష్ణవి, దెవొ గా రాణి, కలెక్టర్ గా మహిమ వ్యవహారించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ... పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులకు స్వయం పాలన ప్రాముఖ్యత, బాధ్యతలు,నాయకత్వ లక్షణాలు అలవడుతాయని తెలిపారు.విద్యార్థుల వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. విద్యార్థులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరెడ్డి,అరుణ, పురుషోత్తమ చారి, విజయలక్ష్మి,బండి అనిల్ కుమార్,దేవేందర్, విద్యార్థులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా నాగులమ్మ మహా జాతర



భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తజనం



**జాతరలో ప్రత్యేక ఆకర్షణగా గుస్సాడి,ధింసా నృత్యాలు.**

**క్రైమ్ మిర్రర్,మంగపేట:** మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల లక్ష్మీ నర్సాపూర్ గ్రామంలో నాగులమ్మ జాతర మూడో రోజు గురువారం పూజారులు వడ్డెలు పాలమాకు వొర్రె వద్ద కంకవనానికి పూజలు చేసి సాయంత్రం రాజుపేట సెంటర్లో నాగులమ్మ అమ్మవారితో ఎదురుకోలు జరిపారు .ఎదురుకొలు చూడటానికి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదిలాబాద్ కు చెందిన ఆదివాసీ గుస్సాడి నృత్యం,తూర్పు గోదావరి జిల్లా చింతూరు గ్రామానికి చెందిన ఆదివాసీ ధింసా నృత్యం జాతరలో ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి.రాత్రి 12:05 నిమిషాలకు నాగులమ్మ పగిడిద్ద రాజుల కళ్యాణ మహోత్సవం ఆదివాసీ సాంప్రదాయ బద్ధంగా నిర్వహించా రు.అనంతరం 3 గంటలకు లోక కళ్యాణార్థం బాడిశ రామకృష్ణ స్వామిజీ అగ్నిగుండంలో నడిచారు.ఆలయ ధర్మకర్త,మెనిజింగ్ ట్రస్టీ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామి ,పూజ కార్యక్రమాలను పర్యవేక్షించగా నాగులమ్మ ఆలయ ప్రధాన పూజారి బాడిశ నాగరమేష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా పూజారులు సోడి సత్యం,కుర్సం పుల్లయ్య, కట్టం సమ్మక్క,చౌళం భవాని,మడకం సుప్రజ,పోలిశెట్టి స్వరూప,వడ్డెలు కోర్స శ్రీకాంత్ ,మూయబోయిన శివ,తుర్స చిన్నబ్బాయి,కారం రాజేష్ పూజ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి కులపెద్దలు కుర్సం విష్ణుమూర్తి,మడకం రాజేశ్వర్ రావు,చౌళం వెంకటేశ్వర్లు ,కొమరం మాధవ రావు,కొమరం పాపారావు,ఇరప రామకృష్ణ,ఇందారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాటేదాన్ పారిశ్రామికవాడలోని ప్లైవుడ్ గోదామ్‌లో అగ్ని ప్రమాదం

**భారీగా ఆస్తినష్టం**




**గండిపేట(క్రైం మిర్రర్):** కాటేదాన్ పారిశ్రామికవాడలోని ప్లైవుడ్ గోదామ్‌లో గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పోగతో నిండిపోయింది. ప్రమాద సమయంలో గోదాంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కాటేదాన్‌లో నగరానికి చెందిన రిషాద్ జైన్‌కు సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ ప్లైవుడ్ గోదామ్ ఉంది. హోలీ పండుగ సందర్భంగా గత రెండు రోజుల నుంచి గోదాంను మూసివేశారు. గురువారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఐదు అగ్నిమాపక కేంద్రాల ద్వారా మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సంఘటన స్థలాన్ని రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ సందర్శించి పరిశీలించారు. ప్లైవుడ్ గోదామ్‌లో అగ్ని ప్రమాదం జరగడంతో భారీగా ఆస్తినష్టం సంభవించినట్లు తెలుస్తుంది.

# అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

**ఆరు బైకులు స్వాధీనం.**

**కేసు వివరాలు వెల్లడించిన సీఐ చరమందరాజు**



క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్: పట్టణంలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను హుజూర్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు.నిందితుల నుంచి ఆరు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు తెలిపారు. గురువారం పట్టణంలోని సీఐ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో ఇద్దరు వ్యక్తులు హెచ్ఎఫ్ డీలక్స్ బైక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూడగానే పారిపోయేందుకు ప్రయత్నించగా యస్ఐ మోహన్ బాబు తన సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకొని విచారించగా,దొంగతనాల అసలు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు.పోలీసుల విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుంటూరు జిల్లా మేడికొండూరు గ్రామానికి చెందిన షేక్ మాబు, షేక్ రిహాజ్‌గా గుర్తించామని సీఐ తెలిపారు.ఉమ్మడి నల్గొండ , గుంటూరు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు వారు అంగీకరించా రు.దొంగిలించిన ఆరు బైకులను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్ఐ మోహన్ బాబు, పోలీస్ సిబ్బంది శ్రీనివాసరెడ్డి,శంభయ్య, పాల్గొన్నారు.

# వేం నరేందర్‌రెడ్డిని కలిసి సన్మానించిన నాయకులు

**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని రాజ్యసభకు తెలంగాణ రాష్ట్రం నుంచి నామినేట్ చేసిన సందర్భంగా వేం నరేందర్‌రెడ్డిని చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నార్సింగి సర్కిల్ మణికొండ కాంగ్రెస్ నాయకులు మెరుగు జితేందర్, కిరణ్‌కుమార్, షేక్ హాజీ, శ్రీధర్ తదితరులున్నారు.



# వట్టిపల్లిలో ఘనంగా ముగిసిన ఉచిత వైద్య శిబిరం

**110 మందికి వైద్య పరీక్షలు, తగు సూచనలు..**



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మండలంలోని వట్టిపల్లి గ్రామ పంచాయతీ నందు, గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఎల్బి నగర్‌లోని కామినేని హాస్పిటల్ సహకారంతో, గ్రామ సర్పంచ్ సిరసవాడ బిక్షమయ్య ఆధ్వర్యంలో, ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ శిభిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ తబసుమ్, రోగులను పరీక్షించి తగిన సలహాలు అందించారు. గ్రామంలోని సుమారు 110 మంది ఈ వైద్య సేవలను వినియోగించుకున్నారు. వీరికి బీపీ, షుగర్ తో పాటు కంటికి సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. జ్వరం, జలుబు, ఒంటి నొప్పులు, ఇతర సాధారణ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ సిరసవాడ బిక్షమయ్య మాట్లాడుతూ.. వట్టిపల్లి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో కూడా ఇటువంటి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు తమ ఆధార్ కార్డు, లింక్ అయిన ఫోన్ నంబర్లతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందిద్దాం: కలెక్టర్ కుమార్ దీపక్

## నస్పూర్‌లో 'మంచిర్యాల శుభ్రత – ఆరోగ్య భద్రత' కార్యక్రమం ప్రారంభం

## వచ్చే 99 రోజుల్లో పారిశుద్ధ్యంపై పక్కా కార్యాచరణ

## మేయర్, కమిషనర్‌తో కలిసి 32వ డివిజన్‌లో పర్యటన



**మంచిర్యాల, మార్చి 05 (క్రైమ్ మిర్రర్) :** పరిశుభ్రత అనేది కేవలం ఒక కార్యక్రమం కాదు, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య నిర్వహణను బాధ్యతగా తీసుకున్నప్పుడే భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని ఆయన పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ 32వ డివిజన్‌లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ చల్లా రమ్యలతో కలిసి ఆయన 'మంచిర్యాల శుభ్రత – ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత' అనే ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జిల్లావ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే 99 రోజుల పాటు కొనసాగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. కేవలం వీధులనే కాకుండా, అన్ని ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయడంతో పాటు అక్కడ పెండింగ్‌లో ఉన్న జనన, మరణ ధృవీకరణ పత్రాలు, భవన నిర్మాణ అనుమతుల ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, అక్కడ చెత్తను వేరుచేయాలని సూచించారు. నివాస గృహాలు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాల్లో చెత్తను రోడ్లపై లేదా మురుగు కాలువల్లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీధి దీపాల మరమ్మతులు, మురుగు కాలువల ప్రక్షాళన పనులను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

**60 డివిజన్లలో ప్రత్యేక డ్రైవ్: మేయర్**

మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో విద్యుత్, తాగునీరు, మున్సిపల్ శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఫంక్షన్ హాళ్లు, ఆసుపత్రులు, మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనల ప్రకారం పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం నస్పూర్ మండలం తీగల్ పహాడ్ పరిధిలోని మండల పరిషత్ పాఠశాల భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నస్పూర్ కేంద్రంలోని ఈవీఎం గోదామును అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి త్రైమాసిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.




# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల:** చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి చేవెళ్ల నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రహదారి నిర్మాణాలు, తాగునీటి సమస్యల పరిష్కారం, విద్యా మరియు వైద్య సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై ముఖ్యమంత్రితో విస్తృతంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్యమంత్రిని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ముద్విన్ గ్రామంలో కుళ్లిన మటన్ సరఫరా కలకలం..

## చనిపోయిన గొర్రెలు, మేకల మాంసం నిల్వ చేసి అమ్మకాలు – – గ్రామ ప్రజల్లో ఆందోళన..





**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామంలో కుళ్లిన మటన్ అమ్మకాల ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఓ మటన్ షాప్ యజమాని కొంతకాలంగా చనిపోయిన మేకలు, గొర్రెలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఆ మాంసాన్ని ఫ్రీజ్‌లో నిల్వ చేసి ప్రతిరోజు అమ్మే తాజా మటన్‌లో కలిపి విక్రయిస్తున్నాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. హోళి పండుగ సందర్భంగా కొందరు గ్రామస్తులు మటన్ కొనుగోలు చేసి ఇంట్లో వండి తిన్న తర్వాత కుటుంబ సభ్యులంతా అస్వస్థతకు గురై వాంతులు చేసుకుని ఆసుపత్రి పాలయ్యారని సమాచారం. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గ్రామ ప్రజలు వెంటనే ఫుడ్ ఇన్స్పెక్టర్ స్పందించి ముద్విన్ గ్రామంలో జరుగుతున్న ఈ మటన్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి నీ కలిసిన శంకర్ పల్లి నూతన మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్ పల్లి నూతన మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. మార్కెట్ కమిటీ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సమర్థవంతంగా పనిచేస్తానని అన్నారు . మాజీ ఎంపీ రంజిత్ రెడ్డికి శాలువా కప్పి పూశ్వగుచ్చం అందజేశారు. అన్ని కార్యక్రమాలలో పాల్గొని తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునందన్ రెడ్డి పాల్గొన్నారు.



# మాదిగలకు రాజ్యసభలో ఒక స్థానం కల్పించాలి: మైసగాళ్ల బుచ్చేంద్ర మాదిగ

## రాహుల్ గాంధీకి మంద కృష్ణ మాదిగ బహిరంగ లేఖకు మద్దతు

## నిర్మల జగ్గారెడ్డికి వినతి పత్రం సమర్పణ

## పార్లమెంట్‌లో మాదిగలకు ప్రాతినిధ్యం లేదని ఆవేదన





**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మార్చి 05:** తెలంగాణ రాష్ట్రం నుండి భర్తీ కాబోయే రాజ్యసభ స్థానాల్లో మాదిగ సామాజిక వర్గానికి ఒక సీటు కేటాయించాలని ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగాళ్ల బుచ్చేంద్ర మాదిగ డిమాండ్ చేశారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లాలో ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పి మరియు దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డికు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బుచ్చేంద్ర మాదిగ మాట్లాడుతూ... లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకు మంద కృష్ణ మాదిగ రాసిన బహిరంగ లేఖలో ప్రస్తావించిన అంశాలను గుర్తుచేశారు. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ప్రస్తుతం పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేదని పేర్కొన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి, వరంగల్, నాగర్‌కర్నూల్ వంటి ఎస్సీ రిజర్వ్ పార్లమెంట్ స్థానాల్లో కూడా మాదిగలకు అవకాశం ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికే ఇతర సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ మాదిగలకు మాత్రం పార్లమెంట్‌లో స్థానం లేకపోవడం అన్యాయమని అన్నారు. తెలంగాణ నుండి భర్తీ కాబోయే రెండు రాజ్యసభ స్థానాల్లో కనీసం ఒకటి మాదిగలకు కేటాయిస్తే సామాజిక న్యాయం జరుగుతుందని, అలాగే కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో గౌరవం పెరుగుతుందని బుచ్చేంద్ర మాదిగ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పెద్దగీత మాదిగ, నల్లోల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, గంధగళ్ళ వీరయ్య మాదిగ, జంగం నవీన్ మాదిగ, పెంటయ్య మాదిగ, భాస్కర్ మాదిగ, ప్రభాకర్ మాదిగ, ఎండి ఫరీద్ తదితర ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పి నాయకులు పాల్గొన్నారు.

# లబ్ది దారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాల పంపకం

**క్రైం మిర్రర్ (మొయినాబాద్) మార్చి 05:** మొయినాబాద్ మండలం లోని నక్కలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంగళారం యాదయ్య, ఉప సర్పంచ్ గౌండ్ల నిరంజన్ గౌడ్ లు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇందిరమ్మ హౌసింగ్ స్కీమ్ ద్వారా నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గ్రామంలో ఇంకా అర్హత కలిగిన మరికొంతమంది లబ్ధిదారులను కూడా పథకంలో భాగస్వాములు చేయడానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని సర్పంచ్, ఉప సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోడం పట్ల గోపాల్ రెడ్డి, మంగళారం బుచ్చయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు గౌరీ రవి, నాయకులు భాను గౌడ్, గౌరీ శ్రీకాంత్, ఎండి ఆషం మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న గృహ సదుపాయం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.